సాక్షి తూర్పుగోదావరి

గురువారం । 13 । ఫిబ్రవరి । 2025



పౌర్ణమి స్నానం.. పావన భరితం

మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం అంతర్వేది వద్ద సముద్ర తీరంలో భక్తిభావం ఉప్పొంగింది.


8లో



సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని అన్నదాన పథకానికి బాలకృష్ణారెడ్డి, శైలజ దంపతులు (నెల్లూరు) రూ.1,00,116 విరాళం అందచేశారు.

డెల్టా కాలువలకు 8,850 క్యూసెక్కులు



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 8,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 4,400 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

జిల్లా మీదుగా ప్రత్యేక రైళ్లు

రాజమహేంద్రవరం సిటీ: ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నెల 14,16.21,23 తేదీలలో జిల్లా మీదుగా పలు రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ప్రకటించారు. 14,21 తేదీలలో చర్లపల్లి – కాకినాడ టౌన్(07031) 16,24 తేదీలలో కాకినాడ టౌన్ చర్లపల్లి(07032) రైళ్ల నడవనున్నాయని తెలిపారు. ప్రయాణికులు ఈ ప్రత్యేక రైళ్లను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వీరే..

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో తూర్పుగోదావరి జిల్లాలోని అనపర్తి, రాజానగరం, గోపాలపురం నియోజకవర్గాలలో మండలాలకు పార్టీ అధ్యక్షులను నియమిస్తూ బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

మండల అధ్యక్షులు వీరే..

అనపర్తి నియోజకవర్గంలో: బిక్కవోలు- పోతుల శ్రీనివాస్ నాగదుర్గ ప్రసాద్‌రెడ్డి (బుజ్జి), పెదపూడి- గుత్తుల .వి. వెంకట సత్యనారాయణ(రమణ), రంగంపేట- నల్లా శ్రీనివాసరావు, అనపర్తి –సత్తి రామకృష్ణారెడ్డి(రాంబాబు)

రాజానగరం నియోజకవర్గంలో: కోరుకొండ –అడపా కనకరాజు, రాజానగరం- దూలం సూర్యనారాయణ, సీతానగరం- గంట శ్రీనివాసరావు.

గోపాలపురం నియోజకవర్గంలో: గోపాలపురం – వెలగ శ్రీరామమూర్తి, దేవరపల్లి- కూచిపూడి వీర వెంకట సత్యనారాయణ, ద్వారకాతిరుమల- ప్రతాపనేని శ్రీనివాసరావు, నల్లజర్ల – వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యంలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

బ్యారన్లలో క్యూరో మీటర్లు

దేవరపల్లి: పొగాకు బ్యారన్లలో తప్పనిసరిగా క్యూరో మీటర్లు ఏర్పాటు చేయాలని బోర్డు రీజనల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్ రైతులకు విజ్ఞప్తి చేశారు. దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం వేలం కేంద్రాల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం బోర్డు అధికారులు, పొగాకు కొనుగోలు సంస్థల ప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు పొగాకు తోటలు, బ్యారన్లను సందర్శించారు. క్యూరింగ్ చేసిన పొగాకును పరిశీలించారు. ఈ సందర్భంగా బోర్డు రీజనల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్ మాట్లాడుతూ పొగాకు క్యూరింగ్‌లు ముమ్మరంగా జరుగుతున్నందున బ్యారన్లలో క్యూరో మీటర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పక్వానికి వచ్చిన ఆకులను క్యూరింగ్ చేసి నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. పొగాకు గ్రేడింగ్‌లో జాగ్రత్తలు తీసుకోవాలని, అన్య పదార్థాలు లేకుండా చూడాలన్నారు. గ్రేడింగ్ చేసిన పొగాకులో ఎక్కువ తేమ శాతం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మండెలు ఎప్పటికప్పుడు తిరగవేసుకోవాలన్నారు. దీని వల్ల ఎక్కువ రోజులు పొగాకు నిల్వ ఉన్నప్పటికి నాణ్యత దెబ్బతినదని ఆయన తెలిపారు. దేవరపల్లి వేలం నిర్వహణాధికారి హేమస్మిత, ఐటీసీ, జీపీఐ, పీఎస్‌ఎస్, డక్కన్ కంపెనీల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూ భయం

- జిల్లాను వణికిస్తున్న వైరస్ ప్రభావం
- కానూరు, దేవరపల్లి, మిర్తిపాడులో కలకలం
- పౌల్ట్రీ రంగాన్ని కుదిపేసిన వైనం
- ఒక్కసారిగా దిగజారిన చికెన్, గుడ్డు ధరలు
- అప్రమత్తమైన అధికారులు
- చికెన్ విక్రయాలపై నిషేధం
- వైద్య బృందాలతో ఇంటింటా సర్వే



కానూరు అగ్రహారంలో కోళ్ల ఫారాల వద్ద బ్లీచింగ్ వేస్తున్న సిబ్బంది



కానూరు-అగ్రహారంలో వైరస్ సోకిన కోళ్లను పాతిపెడుతున్న వైద్య సిబ్బంది

సాక్షి, రాజమహేంద్రవరం: బర్డ్ ఫ్లూ ఉమ్మడి గోదావరి జిల్లాల ప్రజలను వణికిస్తోంది. పెరవలి మండలం కానూరులో మొదలైన కలకలం ఉభయ గోదావరి జిల్లాలకు విస్తరించింది. ఈ నెల 3వ తేదీన కొన్ని కోళ్లకు సోకిన వైరస్ లక్షలాది కోళ్లకు వ్యాపించింది. ఉన్నట్లుండి కోళ్లు కుప్పకూలిపోతున్నాయి. ప్రతి రోజూ వేల సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి. భోపాల్‌లోని హై సెక్యూరిటీ ల్యాబ్ బర్డ్ ఫ్లూగా నిర్ధారించడంతో ప్రజల్లో మరింత భయం నెలకొంది. వెరసి జిల్లా వ్యాప్తంగా చికెన్ సెంటర్లు వెలవెలబోతున్నాయి. ధర తగ్గినా కొనేందుకు ఎవరూ సాహసించడం లేదు. వైరస్ దెబ్బకు పౌల్ట్రీ రైతులు లబోదిబోమంటున్నారు. దీనికితోడు గుడ్డు ధర సైతం దిగజారడంతో ఆందోళన చెందుతున్నారు. వైరస్ వ్యాప్తిపై 'సాక్షి'లో ఈ నెల 3వ తేదీన 'గుడ్లు తేలేస్తున్న కోళ్లు' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా అధికారులు అప్రమత్తమయ్యారు. అందులో భాగంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అప్రమత్తమయ్యారు. వెంటనే రంగంలోకి దిగిన కలెక్టర్ కానూరు గ్రామంలో వైరస్ వ్యాప్తిపై ఆరా తీశారు. స్వయంగా పరిశీలించి వైరస్ సోకిన కోళ్లు విక్రయించకుండా చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉంటే సీతానగరం మండలం మిర్తిపాడులో వైరస్ కలకలం రేగింది. పౌల్ట్రీలో కోళ్లు మృత్యువాత పడ్డాయి. అయితే ఇది వైరస్ ప్రభావం కాదని అధికారులు వెల్లడిస్తున్నారు. వాతావరణ మార్పుల కారణంగా మృతి చెందినట్లు చెబుతున్నారు. ఏది ఏమైనా వైరస్ భయంతో మాంసం ప్రియులు ముక్కకు దూరమవుతున్నారు.

పౌల్ట్రీ రంగంపై పిడుగు

బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాప్తితో పౌల్ట్రీ రంగం కుదేలైంది. నష్టాలు చవిచూస్తున్నట్లు పౌల్ట్రీ యజమానులు వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 50,000కు పైగా కోళ్లు పెంచే షెడ్లు 245 ఉన్నాయి. 5వేల నుంచి 40 వేల కోళ్లు పెంచే సామర్థ్యం ఉన్న షెడ్లు వందకు పైగా ఉంటాయని అంచనా. వీటిలో 2.50 కోట్ల కోళ్ల పెంపకం సాగుతోంది. అనపర్తి నియోజకవర్గంలోనే 70 లక్షల కోళ్లు, నిడదవోలు నియోజకవర్గంలో 50 లక్షల కోళ్లు, నల్లజర్ల, గోపాలపురం, కొవ్వూరు, కడియం, సీతానగరం మండలాల్లో సుమారు మరో 30 లక్షల కోళ్ల పెంపకం జరుగుతోంది. ప్రతి రోజూ 80 లక్షల కోడిగుడ్ల ఉత్పత్తి అవుతోంది. 48 లక్షల గుడ్లు ఒడిశా, బిహార్, కోల్‌కతాకు ఎగుమతి అవుతున్నాయి. వైరస్ వ్యాప్తితో గుడ్ల వినియోగం భారీగా తగ్గింది. ప్రతి రోజూ 42 లక్షల గుడ్లు స్థానికంగా వినియోగిస్తున్నారు. అంగన్‌వాడీ చిన్నారులకు, మధ్యాహ్న భోజనం విద్యార్థులకు గుడ్లు నిలుపుదల చేయడంతో 20 లక్షల లోపు గుడ్లు మాత్రమే వినియోగిస్తున్నారు. దీంతో నష్టం వాటిల్లుతోంది. గత నాలుగు రోజులుగా వైరస్ ప్రభావంతో వ్యాపారం కుదేలైంది. ఉన్న గుడ్లు, కోళ్లను సైతం అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడింది. సీతానగరం వద్ద కోడి రూ.30కి విక్రయిస్తున్నా కొనే నాథుడే కరువయ్యాడు.

కానూరులోనే లక్ష కోళ్లు మృత్యువాత

పెరవలి మండలం కానూరు–అగ్రహారంలోనే ఇప్పటి వరకు లక్ష కోళ్లు వైరస్ ధాటికి మృత్యువాత పడినట్లు సమాచారం. జిల్లాను బర్డ్ ఫ్లూ బెంబేలెత్తిస్తుండటంతో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి నేతృత్వంలో అధికారం యంత్రాంగం అప్రమత్తమైంది. వైరస్ వ్యాప్తికి కారణమైన కానూరు అగ్రహారంలో 144 సెక్షన్ విధించారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీ వైద్యాధికారులు అనుక్షణం పర్యవేక్షిస్తున్నారు. కోళ్ల ఫారాలు, గ్రామంలో వీధులు, గృహాల వద్ద బ్లీచింగ్, సోడియం క్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేస్తున్నారు. కానూరు అగ్రహారం నుంచి 10 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల్లో మాంసం విక్రయాలపై నిషేధం విధించారు. దీంతో చికెన్ సెంటర్లు మూతపడ్డాయి. పంచాయతీ అధికారులు మాంసం దుకాణాలు, హోటల్స్‌కు నోటీసులు ఇచ్చారు. హోటళ్లలో శాఖాహారం మాత్రమే అందిస్తున్నారు. బర్డ్ ఫ్లూ మనుషులకు, జంతువులకు సోకకుండా ముందస్తుగా ఇతర జంతువులకు వ్యాక్సిన్ వేస్తున్నారు.

కట్టుదిట్టమైన చర్యలు



బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాప్తి చెందకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. కానూరు నుంచి కోళ్లు, గుడ్లు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వైరస్ సోకిన కోళ్లను ఇప్పటికే పాతిపెట్టాం. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు మధ్యాహ్న భోజనానికి కోడి గుడ్ల సరఫరా ఆపేశాం. రెవెన్యూ అధికారులను సైతం రంగంలోకి దింపాం. పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు మండలాల పరిధిలో 34 గ్రామాల్లో ఇంటింటికీ సర్వే నిర్వహిస్తున్నాం. సర్వే కోసం 64 వైద్య బృందాలను నియమించాం. సీతానగరం మండలంలో సైతం ఇతర జంతువులకు వైరస్ సోకకుండా వ్యాక్సిన్ వేయిస్తున్నాం. తాగాజా సీతానగరంలో వైరస్ ఉన్నట్లు కలకలం రేగింది. ఉష్ణోగ్రతల మార్పు వల్ల కోళ్లు చనిపోయాయి. ఎలాంటి వైరస్ సోకలేదు.

– పి.ప్రశాంతి, జిల్లా కలెక్టర్

రెడ్ అలర్ట్

బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాప్తి ఉన్న ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పెరవలి, సీతానగరం మండలాల్లోని కోళ్ల ఫారాల చుట్టూ కిలోమీటరు పరిధిలో రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఆ ప్రాంతంలో చికెన్ దుకాణాలు మూసివేశారు. వైరస్ వ్యాపించిన పది కిలోమీటర్ల వరకు నిఘా ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే నవంబర్, డిసెంబర్, జనవరి నెలల్లో ఉష్ణోగ్రతల్లో వస్తున్న మార్పుల కారణంగా వైరస్ వ్యాప్తి చెందినట్లు పశుసంవర్థక శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. చనిపోయిన కోళ్లను పాతిపెట్టకుండా వదిలేయడంతో వైరస్ వేగంగా వ్యాప్తి చెందిందని చెబుతున్నారు. ఉష్ణోగ్రతలు 32 నుంచి 34 డిగ్రీల మధ్య ఉంటే బర్డ్ ఫ్లూ వైరస్ జీవించ లేదని, ప్రస్తుతం రాష్ట్రంలో అధిక శాతం ప్రాంతాల్లో 34 డిగ్రీల పైనే నమోదవుతుందన్న వైరస్ వ్యాప్తి చెందలేదని అధికారులు అంచనాలు వేస్తున్నారు.



పెరవలిలో చికెన్ దుకాణాలకు నోటీసులు అందిస్తున్న వీఆర్‌ఓ



కానూరులో మూతపడిన చికెన్ షాపు

వ్యవస్థలను మేనేజ్ చేస్తున్న చంద్రబాబు

- ఇది ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్పష్టమైంది
- మొదట నామినేషన్ తిరస్కరణ తరువాత అంగీకారం
- మాజీ ఎంపీ హర్షకుమార్



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ: వ్యవస్థలను మేనేజ్ చేయడంలో చంద్రబాబును మించి మరెవ్వరూ లేరని, ఈ విషయం తూర్పు,పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఏలూరు కలెక్టరేట్‌లో స్పష్టం అయిందని మాజీ ఎంపీ జీవీహర్ష కుమార్ ధ్వజమెత్తారు. బుధవారం రాజమహేంద్రవరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో ఏలూరు కలెక్టర్ ప్రభుత్వానికి కొమ్ము కాసినట్లుగా అనిపించిందన్నారు. మంగళవారం ఏలూరు కలెక్టరేట్‌లో జరిగిన నామినేషన్ స్క్రూటినీ వ్యవహారంలో స్వతంత్ర అభ్యర్థి జీవీ సుందర్ ప్రత్యర్థి అభ్యర్థులపై కొన్ని అభ్యంతరాలు లేవనెత్తగా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ తనకున్న విశేష అధికారాలతో తోసిపుచ్చడంతో పలు అనుమానాలు కలుగుతున్నాయన్నారు. సీపీఎం అభ్యర్థి దిడ్ల వీర రాఘవుల నామినేషన్ మొదట డిస్‌క్వాలిఫై అయినట్టు కలెక్టర్ ప్రకటించారని, చివరలో క్వాలిఫైడ్ అని లిస్టులో ప్రకటించారని ధ్వజమెత్తారు. మొదటి డిస్ క్వాలిఫై చేసిన అనంతరం క్వాలిఫై అవ్వడంపై ప్రభుత్వం ఒత్తిడి ఉందని ఆరోపించారు. ఓట్లు చీల్చడం కోసమే డిస్‌క్వాలిఫై అయిన అభ్యర్థిని మళ్లీ రంగంలోకి దింపారని, దీనికి సీఎం చంద్రబాబు నుంచి ఒత్తిడి వచ్చిందన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత సీఎం చంద్రబాబు... మాజీ సీఎం జగన్ హయాంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థుల్ని తిరస్కరిస్తున్నారని, నామినేషన్ వేయడాన్ని కూడా అడ్డుకున్నారని ఆరోపణ చేశారన్నారు. కాని ఇప్పుడు అదే సీఎం నామినేషన్ ప్రక్రియలో ఇంత వివక్షను చూపించడం సరికాదన్నారు. టీచర్స్ తరఫున నిలబడ్డ అభ్యర్థి కూటమి ప్రభుత్వానికి బినామీగా తయారయ్యాడని హర్ష కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. పీడీఎఫ్ అభ్యర్థి కూటమి అభ్యర్థికి అమ్ముడు పోయారని ఆరోపించారు. భవిష్యత్తులో ప్రభుత్వాన్ని ప్రశ్నించగల దమ్ము జీవి సుందర్‌కి ఉందని అందరూ దాన్ని గమనించి తన కుమారుని గెలిపించాలని హర్షకుమార్ విజ్ఞప్తి చేశారు.

సమర్థంగా ప్రీ పబ్లిక్ పరీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో వాసుదేవరావు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పదో తరగతి ప్రీ పబ్లిక్ పరీక్షలు సమర్థంగా నిర్వహించాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాజమహేంద్రవరం అర్బన్‌లో ఉన్న ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రైవేట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కార్యాలయానికి సమర్పించవలసిన ముఖ్యమైన సమాచారాన్ని సమయానికి అందజేయకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికీ సమ్మేటివ్ మార్కులు ఆన్‌లైన్ చేయకపోవడం, యు– డైస్ అప్డేషన్ కాకపోవడం, అపార్ సంఖ్యలు నూరు శాతం పూర్తి చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అన్ని పాఠశాలల సమగ్ర సమాచారాన్ని మండల స్థాయిలో క్రోడీకరించి రాష్ట్ర స్థాయికి పంపవలసి ఉందన్నారు. పెండింగ్ పనులు పూర్తి చేయడానికి కలెక్టర్ శనివారం వరకు మాత్రమే సమయాన్ని ఇచ్చారని, గడువు లోపల అన్ని పనులు నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి దిలీప్‌కుమార్, డివిజనల్ లెవెల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పి. వీణాదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, రాజమహేంద్రి అర్బన్‌లోని ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నష్టాలు కాబట్టీ..

- ఇటుక పరిశ్రమకు గడ్డుకాలం
- డిమాండ్ లేక పేరుకుపోతున్న నిల్వలు
- తాత్కాలికంగా పలు బట్టీల మూత



పినపళ్లలో బట్టీలో ఇటుకలు తయారు చేస్తున్న కార్మికులు

ముడి సరకు	గత ధర (రూ.)	కొత్త ధర (రూ.)
నల్లమట్టి (ఐదు యూనిట్లు)	7000	13000
బొండు ఇసుక (ట్రాక్టర్)	500	2300
ఊక (టన్ను)	1500	5400
బూడిద (టన్ను)	1200	2500
పుల్లలు (టన్ను)	1400	3500
తాటిపట్టెలు (టన్ను)	1000	2300

ఆలమూరు: ఇటుక పరిశ్రమ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది.. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో బట్టీల్లో తయారు చేస్తున్న ఇటుకకు ఇతర ప్రాంతాల్లో డిమాండ్ లేక ఎగుమతులు నిలిచిపోయి పరిశ్రమ నష్టాల ఊబిలో పడింది. రోజురోజుకూ పెరుగుతున్న ముడి సరకు ధరలకు తోడు కూలీల వ్యయం అధికం కావడంతో పరిశ్రమ మూతబడే పరిస్థితి నెలకొంది. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 30 వేల మంది జీవనోపాధి పొందుతున్నారు. ఈ బట్టీలో ఎక్కువగా ఉత్తరాంధ్ర, బీహార్, పశ్చిమ బెంగాల్, ఒడిశాకు చెందిన కూలీలు పని చేస్తున్నారు. ఉత్పత్తికి తగిన డిమాండ్ లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. ఇప్పటికే పేరుకుపోతున్న ఇటుక నిల్వలతో వచ్చే నష్టాలను అధిగమించేందుకు బట్టీ యజమానులు తాత్కాలికంగా తమ బట్టీలను మూసివేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలోని కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాలో తయారవుతున్న ఇటుకకు తగిన డిమాండ్ లేకుండా పోయింది. కోనసీమ జిల్లాలో దాదాపు 2,300 ఇటుక బట్టీల వరకూ ఉన్నాయి. కొత్తపేట, ఆత్రేయపురం, కపిలేశ్వరపురం, అయినవిల్లి, రాయవరం, పి.గన్నవరం, కె.గంగవరం, ప్రత్తిపాడు, గోకవరం, నిడదవోలు, గోపాలపురం, కొవ్వూరు మండలాల్లోని కొన్ని ప్రాంతాలు ఇటుక తయారీలో కీలక భూమిక వహిస్తున్నాయి. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఆలమూరు, రాయవరం మండలాల్లో తయారైన ఇటుకకు నాణ్యపరంగా, సైజు పరంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. దీంతో బహిరంగ మార్కెట్‌తో సంబంధం లేకుండా ఆ ఇటుకకు ఎల్లప్పుడూ మంచి డిమాండ్ ఉంటుంది. అక్కడ కూడా ఇటుక నిల్వలు పేరుకుపోయే పరిస్థితి ఏర్పడింది. తయారు చేసిన ఇటుకను విక్రయించుకోలేక జిల్లాలో సుమారు 500 బట్టీల్లో నిర్వాహకులు ఇటుక ఉత్పత్తిని నిలిపివేశారు. ఇలాంటి పరిస్థితులు నెలల తరబడి కొనసాగితే జిల్లాలో దాదాపు మూడు వంతుల బట్టీలు మూసివేయక తప్పదని నిపుణులు అంచనా వేస్తున్నారు.

నష్టాలకు కారణాలెన్నో..

ఉమ్మడి జిల్లాలోని ఇటుక పరిశ్రమ నష్టాలను ఎదుర్కొనడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఇటుకలో ప్రధానంగా ఉపయోగించే నల్లమట్టి, బొండు ఇసుక సరఫరా అంతగా లేకపోవడం, ముడిసరకు ధరలు విపరీతంగా పెరగడం నష్టాలకు కారణమవుతుంది. అలాగే ఉచిత ఇసుక పేరిట సామాన్యులకు పూర్తిస్థాయి ఇసుక అందుబాటులో లేకపోవడం, ఒక్కోచోట భారీ స్థాయిలో ధర వెచ్చించి కొనుగోలు చేయడంతో కొత్తగా చేపట్టే గృహ నిర్మాణాలు నిలిచిపోయాయి. అనేక మంది మధ్య తరగతి ప్రజలు, కాంట్రాక్టర్లు ఎక్కువగా నిర్మాణాల్లో సిమెంట్ ఇటుకను వినియోగించడం కూడా ఇటుక అమ్మకాలకు అవరోధంగా మారింది. ఇటీవల కాలంలో తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాల్లో ఎక్కడికక్కడే ఇటుక పరిశ్రమలు ఏర్పాటు చేయడం వల్ల ఎగుమతులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఈ పరిశ్రమలో తలెత్తిన అనిశ్చితితో సుమారు రూ.ఐదు కోట్ల మేర ఇటుక నిల్వ పేరుకుపోయినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

ముడిసరకు.. పెరుగుదల అంతకంతకూ ..

ఇటుక తయారీకి ఉపయోగించే ముడిసరకు ధరలు గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం భారీగా పెరిగాయి. వెయ్యి ఇటుక తయారీకి సుమారు రూ.5,500 వరకూ ఖర్చు అవుతుండగా, మార్కెట్‌లో కేవలం రూ.3,500 ధర మాత్రమే పలుకుతుంది. దీంతో ప్రతి వెయ్యి ఇటుక ఉత్పత్తికి రూ.2 వేలు నష్టం వస్తుందని ఇటుక బట్టీ యజమానులు ఆవేదన చెందుతున్నారు. తగిన డిమాండ్ లేక ఆర్థిక లావాదేవీల నిర్వహణకు బట్టీ యజమానులు నష్టాలకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఇటుక తయారు చేసేందుకు కూలీలకు సగటున రూ.600 వరకూ పారితోషికం ఉండగా, అది రూ.900కు చేరుకుంది. సాధారణంగా జిల్లాలో లీజులకు తీసుకునే ఇటుక బట్టీలను నడుపుతుంటారు. గతంతో ఎకరాలకు ప్రదేశాన్ని, సానుకూలతను బట్టి రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షల వరకూ లీజు ఉండగా, ప్రస్తుతం రూ.2.5 లక్షల నుంచి రూ.మూడు లక్షల వరకూ చేరుకుంది.

ఎమ్మెల్సీ ఓట్ల వేట

- ప్రచారం మొదలు పెట్టిన అభ్యర్థులు
- ఉమ్మడి జిల్లా ఓటర్ల మద్దతుకు ప్రయత్నాలు
- పట్టభద్రుల ఓటర్లు 3,15,261 మంది
- నేటితో ముగుస్తున్న ఉపసంహరణ ప్రక్రియ





కాకినాడ సిటీ: ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తుది దశకు చేరుకుంది. పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ గురువారంతో ముగుస్తుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే నామినేషన్ వేసిన అభ్యర్థులు ప్రచారం మొదలు పెట్టారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు కూడా అదృష్టం పరీక్షించుకునేందుకు బరిలో దిగుతున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి పలువురు పట్టభద్రుల స్థానానికి నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 27న పోలింగ్ జరుగనుండగా మార్చి 3న కౌంటింగ్ నిర్వహిస్తారు.

నోటిఫికేషన్‌కు ముందు నుంచే..

ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు నోటిఫికేషన్‌కు ముందు నుంచే ఉమ్మడి జిల్లాల్లో సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు హడావుడిగా ముగిసిన వెంటనే పట్టభద్రుల ఎన్నికల ప్రకటన రావడంతో పట్టభద్రులలో ఎన్నికల హడావుడి మొదలైంది. వివిధ పార్టీల నాయకులతో పాటు పట్టభద్రులు, ప్రభుత్వ వ్యతిరేక అభ్యర్థుల్లో ఉత్సాహం నెలకొంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో నిలిచే అభ్యర్థులు పట్టభద్రులతో సభలు, సమావేశాలు, సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. తాము ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉంటామని సంకేతాలు ఇచ్చారు. ఇక నోటిఫికేషన్ వచ్చి నామినేషన్ల ప్రక్రియ మొదలు కావడంతో నామినేషన్లు వేసి ఓట్ల వేటలో పడ్డారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో ఉన్న ఓటర్లను కలుస్తూ మద్దతు కోరుతున్నారు.

ఖరీదవుతున్న ఎన్నిక

గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి మరింత ఖరీదైన ఎన్నికలుగా మారాయి. గత ఎన్నికల్లో పట్టభద్రుల స్థానం నుంచి సీపీఎం నాయకులు ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) పార్టీ నాయకులు ఇళ్ల వెంకటేశ్వరరావు ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. తాజాగా జరుగుతున్న ఎన్నికల్లో ఓటర్లు ఎవరికి మద్దతు ఇస్తారనేది ఆసక్తిగా మారింది. అభ్యర్థుల మధ్య పోటీ పెరగడంతో విజయంపై ఉత్కంఠ పెరుగుతోంది. ఈసారి ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరగడంతో అభ్యర్థులకు ఖర్చులు సైతం తడిసి మోపడవుతున్నాయి. స్వతంత్ర అభ్యర్థులు సైతం రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈసారి పలువురు వ్యాపారులు, ఆర్థిక, రాజకీయ బలం ఉన్న వారు రంగంలో ఉండడంతో ఖర్చు పెరుగుతోంది. ఎలాగైనా గెలవాలని ఇప్పటికే ఇద్దరు, ముగ్గురు అభ్యర్థులు విపరీతంగా ఖర్చు చేస్తున్నారు.

ఓటర్లకు కాల్స్, మెసేజ్‌లు

పట్టభద్రుల ఓటర్లకు అభ్యర్థుల పేర్లతో కూడిన వాయిస్ కాల్స్ వస్తున్నాయి. అభ్యర్థి పేరు చెబుతూ తమకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. వీటితో పాటు ఓటర్లకు బల్క్ మెసేజ్‌లు, వాట్సాప్ సందేశాలు షేర్ చేస్తున్నారు. ప్రతిరోజూ కనీసం రెండు మూడు ఫోన్ కాల్స్, మెసేజ్‌లు వస్తున్నాయని ఓటర్లు చెబుతున్నారు.

పోటీపోటీగా ప్రచారం

ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధి ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో విస్తరించి ఉంది. రెండు జిల్లాల్లో ప్రచారం చేయాల్సి ఉండడంతో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు స్థానిక నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీల నుంచి పట్టభద్రుల స్థానానికి పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్ ఇప్పటికే ఉమ్మడి జిల్లాల్లో ప్రచారం మొదలు పెట్టారు. స్థానిక కూటమి ఎమ్మెల్యేలు, నాయకులతో మద్దతుతో కూడగట్టుకుంటూ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. పీడీఎఫ్ నుంచి పీవీ రాఘవులు పోటీ చేస్తుండగా స్వతంత్ర అభ్యర్థులుగా 30 మంది వరకూ పోటీలో ఉన్నారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తవ్వడం, ఎన్నిక తేదీ కేవలం 15 రోజుల వ్యవధి మాత్రమే ఉండడంతో అభ్యర్థులు తమ ప్రచార స్పీడ్‌ను పెంచారు.

పట్టభద్రుల ఓటర్లు ఇలా

ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో 3,15,261 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,83,734 మంది పురుషులు, స్త్రీలు 1,31,507 మంది, 20 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. ఈ ఎన్నికల నిర్వహణకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 440 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలు ఉండగా 64,441 మంది ఓటర్లు ఉన్నారు. ఏలూరు జిల్లాలో 62 పోలింగ్ కేంద్రాలు 43,692, కాకినాడ జిల్లాలో 96 పోలింగ్ కేంద్రాలు 70,343 మంది ఓటర్లు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 95 పోలింగ్ కేంద్రాలు 64,327 మంది ఓటర్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 93 పోలింగ్ కేంద్రాలు 64,327 మంది ఓటర్లు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12 పోలింగ్ కేంద్రాలు 4,662 మంది ఓటర్లు ఉన్నారు.

చేనుకు చీరందం..



వరి పంటకు రక్షణగా కట్టిన చీరలు

కిర్లంపూడి: కష్టపడి పండిస్తున్న పంటను కాపాడుకోవడానికి రైతు పడే శ్రమకు ఈ చిత్రమే సజీవ సాక్ష్యం. కిర్లంపూడి మండలం రాజుపాలెంలో ఒక రైతు గేదెలు, మేకల నుంచి వరి పంటను కాపాడుకునేందుకు చీరలను రక్షణగా కట్టిన ఈ చిత్రం ఆకట్టుకుంటోంది.


మంచు కురిసే వేళలో..



గొల్లపాలెంలో ఉదయం ఎనిమిది గంటలకు వీడని మంచుతెర

కాజులూరు: తొలి సంధ్యలో మంచు.. ఆపై భానుడి ఉగ్రరూపం.. మలి సంధ్యలో చలి పులి ఇలా విభిన్న వాతావరణం పల్లె ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కాజులూరు మండలంలో బుధవారం ఉదయం ఎనిమిది గంటలైనా మంచు తెర వీడలేదు. పది గంటల నుంచి భానుడు ఉగ్రరూపాన్ని చూపాడు.

అబ్బో ఆనబ



పది కిలోల ఆనబకాయ

అంబాజీపేట: సాధారణంగా ఆనబకాయ 5 నుంచి 6 కిలోలు ఉండటం సహజం. అదే పది కిలోలు ఉంటే అబ్బురమే. గంగలకుర్రుకు చెందిన అభ్యుదయ రైతు చిట్టావఝుల బాబూరావు తన ఇంటి పెరట్లో దేశవాళీ ఆనబ విత్తనాలను నాటి జీవామృతంతో సంరక్షణ చేపట్టారు. ఆ పాదుకు పది కిలోల బరువు తగ్గకుండా ఆనబ కాయలు కాస్తున్నాయని బాబూరావు తెలిపారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

పౌర్ణమి స్నానం.. పావన భరితం

- అంతర్వేదిలో స్వామికి సుదర్శన చక్రస్నానం
- ఉత్సవాల్లో తొమ్మిదో రోజు కమనీయ ఘట్టం
- గరుడ పుష్పక వాహనంపై గ్రామోత్సవం

సఖినేటిపల్లి: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం అంతర్వేది వద్ద సముద్ర తీరంలో భక్తి భావం ఉప్పొంగింది. కనుచూపు మేర సముద్రంలో శ్రీలక్ష్మీనసింహునితో పాటు అసంఖ్యాకమైన భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామివారి వార్షిక దివ్య తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు స్వామివారి చక్రస్నానం అత్యంత వైభవంగా జరిగింది. సుదర్శన చక్రం ధరించిన నృసింహస్వామి (సుదర్శన పెరుమాళ్ స్వామి) జలక మాడిన కడలిలోనే అసంఖ్యాకమైన భక్తులు స్నానమాచరించి పులకించారు. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి ఆధ్వర్యంలో పేరూరు ఉద్దండ పండితులు స్వామిని శిరస్సుపై ఉంచుకుని సముద్ర స్నానం చేయించారు.

ఒడ్డున జల్లు స్నానానికి ఏర్పాట్లు

సముద్రంలో స్వామితో పాటు పుణ్యస్నానం చేయలేని భక్తుల సౌకర్యార్థం దేవస్థానం జల్లు స్నానానికి ఏర్పాట్లు చేసింది. స్వామివారి కరుణా కటాక్షాలు కలుగజేసేందుకు అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ ఈ చర్యలు తీసుకున్నారు. ఒడ్డున స్వామిని ప్రత్యేక అరపై ఆశీనులు గావించి, ప్రత్యేక పైపు ద్వారా సముద్ర నీటిని స్వామి శిరస్సుపై నుంచి జార విడచారు. అరప కింద ఏర్పాటు చేసిన క్యూలో భక్తులు ఆ నీటి కింద నుంచి వెళ్లి తడిసి పునీతులయ్యారు.

తొలుత ఆలయం వద్ద నుంచి..

ఉదయం 8 గంటలకు ఉత్సవమూర్తులను గరుడ పుష్పక వాహనంపై, పల్లకిలో సుదర్శన చక్రధారుడైన నృసింహస్వామి (చక్ర పెరుమాళ్ స్వామి)ని ఊరేగిస్తూ మంగళ వాయిద్యాలతో తీరానికి అర్చకులు తోడ్కొని వచ్చారు. తీరంలో ఒడ్డున దేవస్థానం ఏర్పాటు చేసిన ప్రత్యేక పందిరిలో వేదికపై స్వామి, అమ్మవార్లను ఆశీనులు గావించారు. నృసింహస్వామికి పంచామృతాలు, కొబ్బరి నీళ్లతో ప్రధానార్చకుడు శ్రీనివాస కిరణ్, స్థానాచార్య రామరంగాచార్యులు, వేద పండితుడు వేంకటశాస్త్రి, అర్చకులు అభిషేకాలు చేశారు. పేరూరు పండితులు సుదర్శన చక్రధారుడైన స్వామిని శిరస్సుపై ధరించి సముద్ర స్నానం చేయించారు. స్వామితో పాటు భక్తులు, అధికారులు, ప్రముఖులు పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామిని అర్చకులు ఊరేగింపుగా వసంత మండపానికి తీసుకువెళ్లారు. దధ్యోజనం, పానకాలను స్వామివారికి ఆలయ అర్చకులు నైవేద్యంగా పెట్టారు. పిదప స్వామిని గరుడ పుష్పక వాహనంపై ఊరేగిస్తూ ఆలయానికి తోడ్కొని వచ్చారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీ మోహన్, రామచంద్రపురం, కొత్తపేట ఆర్డీవోలు అఖిల, శ్రీకర్, ఎండోమెంట్స్ డీసీ డీఎల్‌వీ రమేష్ బాబు, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామ గోపాల రాజా బహద్దూర్, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ఎంపీపీ వీరా మల్లిబాబు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా ఆలయం వెలుపల, ధర్మదర్శనం, శ్రీఘ్రదర్శనం క్యూలైన్లు భక్తులతో కిక్కిరిశాయి. వేకువజాము నుంచి సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య గంట గంటకూ పెరిగింది. దీంతో మధ్యాహ్నం 12 గంటలయ్యే సరికి భక్తుల సంఖ్య క్యూలో గణనీయంగా పెరిగింది. సాయంత్రం వరకూ క్యూలైన్లలో భక్తులు వెళ్లి, శ్రీస్వామివారిని దర్శించుకున్నారు.



అంతర్వేదిలో దేవస్థానం అధికారులు ఏర్పాటు చేసిన జల్లు స్నానం



సముద్ర స్నానాలకు పోటెత్తిన భక్తులు



చక్రస్నానం చేయించేందుకు స్వామిని తోడ్కొని వెళ్తున్న అర్చకులు, పండితులు

అంతర్వేదిలో నేడు

అంతర్వేది తీర్థ మహోత్సవాల్లో గురువారం పదో రోజు స్థానిక చెరువులో సాయంత్రం 6 గంటలకు హంస వాహనంపై స్వామి, అమ్మవార్లకు తెప్పోత్సవం నిర్వహించనున్నారు. విద్యుద్దీపాల మధ్య, బాణసంచా కాల్పులతో ఈ ఉత్సవం నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరుపుతారు. రాత్రి 8 గంటలకు ఉత్సవరులకు తిరుమంజనాలు, దర్పణసేవ, ధూపసేవ, ద్వాదశ తిరువారాధన, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, శ్రీపుష్పోత్సవం, చెంగోలం విన్నపం, తీర్థగోష్టి, స్వామివారి పవళింపు సేవ అర్చకులు నిర్వహించనున్నారు.

భార్యతో గొడవ పడి భర్త అదృశ్యం



రాజేష్ (ఫైల్)

అమలాపురం టౌన్: భార్యతో గొడవ పడిన భర్త ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. దాదాపు రెండు నెలలుగా అతని ఆచూకీ లభించకపోవడంతో కుటుంబీకులు ఎట్టకేలకు అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లికి చెందిన కొత్వాల రాజేష్ (26) అదృశ్యం కావడంతో అతని తండ్రి అప్పారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. రాజేష్ గత డిసెంబర్ 17వ తేదీ నుంచి అదృశ్యమయ్యాడని అతని తండ్రి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. రాజేష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వైభవం... వసంతోత్సవం



ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి దేవాలయంలో వసంతోత్సవం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ క్షేత్రంలో మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజు బుధవారం వసంతోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో ముందుగా వేగాయమ్మపేటలోని ఆస్థాన మండపం నుంచి కల్యాణ మూర్తులైన మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి, క్షేత్ర పాలకులైన లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండికా సమేత సూరేశ్వరస్వామి వార్లను రథంపై దేవాలయానికి తీసుకు వచ్చారు. ఆలయంలో వేదపండితులు, అర్చకుల వేద మంత్రోచ్ఛరణల మధ్య తీర్థపు బిందె, బాలభోగం, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వసంతోత్సవం, నాకబలి, గ్రామోత్సవాలు నిర్వహించిన అనంతరం త్రిశూల స్నానం, చక్రస్నానం జరిపారు.

నేడు తెప్పోత్సవం

భీమేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం మేలుకొలుపు, సుప్రభాత సేవ, ప్రాతఃకాల అర్చన, తీర్థపు బిందె, బాలభోగం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం భక్తులచే విశేష అభిషేకాలు, మాణిక్యాంబా అమ్మవారికి వివిధ రకాల పుష్పార్చన, కుంకుమార్చనలు నిర్వహిస్తారు. మధ్యాహ్న కాలార్చన, రాజభోగ నివేదన సేవ అనంతరం రాత్రి 6.35 గంటలకు సప్తగోదావరి నదిలో శ్రీస్వామివార్లు, అమ్మవార్ల తెప్పోత్సవం కన్నుల పండువగా జరుపనున్నారు.



భీమేశ్వరాలయ సప్త గోదావరిలో త్రిశూల, చక్ర స్నానం ఆచరిస్తున్న భక్తులు

జేఈఈ మెయిన్స్‌లో ‘తిరుమల’ విజయకేతనం



జేఈఈ మెయిన్స్‌లో అత్యుత్తమ స్కోర్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా జనవరిలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ సెషన్–1 ఫలితాల్లో రాజమహేంద్రవరంలోని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థి కోటిపల్లి యశ్వంత్ సాత్విక్ జనరల్ ఈడబ్ల్యూఎస్ కోటాలో ఆలిండియా టాపర్‌గా నిలిచాడు. బుధవారం ఈ విషయాన్ని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. విద్యార్థులు కోడూరి యశ్వంత్ రాజా, కోటిపల్లి యశ్వంత్ సాత్విక్, పాబోలు శరత్‌సంతోష్, దువ్వు ఆశిష్‌సాయి శ్రీకర్ 99.99 పర్సంటైల్ సాధించారన్నారు. నవులూరి అక్షిత్‌సాయి, కంచుమర్తి ప్రణీత్ 99.98 పర్సంటైల్ సాధించగా, 99.50 పర్సంటైల్ పైన 58 మంది, 99 పర్సంటైల్ పైన 108 మంది, 98 పర్సంటైల్ పైన 199 మంది, 97 పర్సంటైల్ పైన 295 మంది, 96 పర్సంటైల్ పైన 387 మంది, 95 పర్సంటైల్ పైన 480 మంది, 90 పర్సంటైల్ పైన 783 మంది నిలిచారన్నారు. సుమారు వెయ్యి మందికిపైగా విద్యార్థులు తమ పర్సంటైల్ స్కోర్‌తో ఎన్ఐటీ లేదా ఐఐటీల్లో సీట్లు సాధించగలరన్నారు. అత్యుత్తమ స్కోర్‌ను సాధించిన విద్యార్థులను నున్న తిరుమలరావు, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్ బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి అభినందించారు.

‘శ్రీషిర్డీ సాయి’ విద్యార్థుల ముందంజ



జేఈఈ మెయిన్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీషిర్డీసాయి విద్యార్థులతో విద్యా సంస్థల డైరెక్టర్ శ్రీవిద్య, అధ్యాపకులు

కంబాలచెరువు: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ ఫలితాల్లో శ్రీషిర్డీసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని బుధవారం ఆ విద్యా సంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య తెలిపారు. తమ లక్ష్యా ఐఐటీ అకాడమీలో శిక్షణ పొందుతున్న సీహెచ్ మోక్షిత్ 99.97 పర్సంటైల్, ఎ.మోహన్‌శ్రీరామ్‌జీ 99.95, సీహెచ్ గౌతమ్ సాయితేజ 99.91, ఐ.శ్రీసాయి హిమ్నిష్ 99.44, జీవీఎస్ జస్వంత్ 99.01, డీఎంఎస్ రాజ్‌కిరణ్ 99 పర్సంటైల్ సాధించారన్నారు. మొత్తం ఆరుగురు విద్యార్థులు 99 పైగా పర్సంటైల్, 18 మంది 98కు పైగా, 34 మంది 97కు పైగా, 63 మంది 95 పైగా పర్సంటైల్ సాధించినట్లు శ్రీవిద్య వివరించారు. మొత్తం 264 మంది విద్యార్థులు హాజరుకాగా 198 మంది అడ్వాన్స్‌కు అర్హత సాధించవచ్చన్నారు. విద్యా సంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ మాట్లాడుతూ ఏటా తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విజేతలు, అందుకు కృషిచేసిన అధ్యాపక బృందాన్ని చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, లక్ష్య అకాడమీ డీన్ చంద్రశేఖర్ తదితరులు అభినందించారు.

బాలుడి కిడ్నాప్ కేసులో ముగ్గురి అరెస్ట్



నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచిన డీఎస్పీ శ్రీహరిరాజు

తుని: స్థానికంగా సంచలనం రేకెత్తించిన బాలుడి కిడ్నాప్ కేసులో ముగ్గురిని అరెస్ట్ చేశామని పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరి రాజు తెలిపారు. బుధవారం తుని పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ నెల 10న రాణి సుభద్రయ్యమ్మ రోడ్డులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో గోదావరి పెయింట్స్ ఓనర్ దాశెట్టి సూర్యప్రకాష్ కుమారుడు దాశెట్టి పరమేశ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసిన సంఘటనపై తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ కేసు నమోదు చేశారు. కేసు సీరియస్‌ను దృష్టిలో పెట్టుకుని జిల్లా ఎస్పీ బింధు మాదవ్ ఆదేశాల మేరకు సీఐ ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్సైలతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దర్యాప్తు వేగవంతం చేశారు. బాలుడిని కిడ్నాప్ చేసి తీసుకువెళ్లిన కారును ముందుగా ట్రేస్ చేశారు. కారు యజమాని రౌతులపూడి మండలం లచ్చిరెడ్డిపాలేనికి చెందిన చందనాడ కాశివుడును పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. రౌతులపూడి మండలం ఎస్.అగ్రహారానికి చెందిన సూరకాసుల రాముడు, అనకాపల్లి జిల్లా పాయకరావుపేట ఇందిరా కాలనీకి చెందిన మతా రాజీవ్‌తో కలసి కిడ్నాప్ చేసినట్టు విచారణలో బయట పడింది. కాశివుడికి రాముడుతో పరిచయం ఉంది. వీరు ఆర్థిక పరమైన ఇబ్బందులతో సులువుగా డబ్బు సంపాదించేందుకు మరో నిందితుడు రాజీవ్ సహకారం తీసుకున్నారు. అతడు బాలుడు చదువుతున్న ప్రైవేట్ స్కూల్‌లో పీఈటీగా పనిచేస్తున్నాడు. ముగ్గురూ కలసి పథకం ప్రకారం బాలుడిని కిడ్నాప్ చేసి కారులో నర్సీపట్నం రోడ్డుకు తీసుకు వెళ్లారు. ఈ విషయం మీడియాలో రావడంతో భయపడి బాలుడిని వదిలేసి వెళ్లిపోయారు. ఆ ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారు. కిడ్నాప్‌కు వినియోగించిన కారు, బైక్, మూడు సెల్‌ఫోన్లను పోలీసులు సీజ్ చేశారు. కేసు ఛేదించిన ఎస్సైలు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ఆటో, బైక్‌ను ఢీకొన్న కారు



గాయపడిన వారిని అంబులెన్సులో తరలిస్తున్న నగరం పోలీసులు

మామిడికుదురు: పాశర్లపూడి– కైకాలపేట పెట్రోలు బంక్ ఎదురుగా 216వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం మధ్యాహ్నం ఓ కారు బైక్‌తో పాటు ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా, ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. ఆటో డ్రైవర్ రాజోలు మండలం శివకోడుకు చెందిన గుమ్మాపు ప్రభాకర్, అందులో ప్రయాణిస్తున్న అమలాపురం కొంకాపల్లికి చెందిన ఆదిరెడ్డి హరిబాబు, అల్లవరం మండలం కొమరగిరిపట్నానికి చెందిన బొంతు ఉమా మహేశ్వరి తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన ప్రాంతానికి నగరం పోలీసులు చేరుకున్నారు. గాయపడిన వారిని అంబులెన్సులో అమలాపురంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు స్వల్పంగా గాయపడ్డారు. వారికి స్థానికంగా ప్రాథక చికిత్స అందించారు. నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిమ్నాస్టిక్స్‌లో యాసీన్ ప్రతిభ



జిమ్నాస్టిక్స్‌లో పసిడి పతకం గెలుచుకున్న యాసీన్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో ఈ నెల 8 నుంచి 13 వరకూ జరుగుతున్న 38వ జాతీయ క్రీడల్లో జిమ్నాస్టిక్స్‌లో ఏపీ నుంచి పాల్గొన్న యాసీన్ ట్రాంపోలిన్ విభాగంలో రెండోసారి బంగారు పతకం సాధించిందని డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ బుధవారం తెలిపారు. కాకినాడ డీఎస్ఏలోని జిమ్నాజియంలో కోచ్ సురేష్ వద్ద యాసీన్ శిక్షణ పొందుతుందన్నారు. జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్‌లో పసిడి పతకం గెలుచుకున్న యాసీన్‌ను, శిక్షణ అందించిన డీఎస్ఏ జిమ్నాస్టిక్స్ కోచ్ సురేష్‌ను డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్, డీఎస్ఏ కోచ్‌లు సమీర్, రుద్ర, సతీష్‌కుమార్, చిన్నారి, నాగేంద్ర, రాష్ట్ర పీఈటీ సంఘ అధ్యక్షుడు జార్జి, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు రవిరాజు, హరీష్ స్పోర్ట్స్ అధినేత టి.హరీష్ అభినందించారు.

యువతి ఆత్మహత్యాయత్నం

అల్లవరం: అమలాపురానికి చెందిన ఓ యువతి (25) బోడసకుర్రు బ్రిడ్జిపై నుంచి నదిలోకి దూకేందుకు ప్రయత్నించిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మధ్యాహ్నం బ్రిడ్జిపై నుంచి నదిలోకి దూకేందుకు సిద్ధపడగా అటుగా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు అప్రమత్తమై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతిని నిలువరించి అల్లవరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ యువతికి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించామని ఎస్సై హరీష్‌కుమార్ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా సైకిల్ యాత్ర



ప్రపంచ సైకిల్ యాత్రికుడు ముత్తు సెల్వన్‌కు రూ.10 వేల సాయం చేస్తున్న కంబాల శ్రీనివాసరావు

గోకవరం/ రాజమహేంద్రవరం రూరల్: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా సైకిల్ యాత్ర చేపట్టిన ముత్తు సెల్వన్ మంగళవారం రాత్రి గోకవరం చేరుకున్నారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్‌కు చెందిన ముత్తు సెల్వాన్ 2021లో సైకిల్‌యాత్ర చేపట్టారు. పలు దేశాల్లో సైతం ఆయన సైకిల్ యాత్ర నిర్వహించారు. ఇందులో భాగంగా గోకవరం చేరుకున్న ఆయనకు స్థానికులు స్వాగతం పలికి సెల్ఫీలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన తన సైకిల్ యాత్ర విశేషాల గురించి స్థానికులతో పంచుకున్నారు. కరోనా సమయంలో ఆక్సిజన్ లభించక లక్షలాది మంది ప్రజలు మృతి చెందారని, ఈ సంఘటన తనను ఎంతో కలచి వేసిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 10 లక్షల మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే సంకల్పంతో 2021 డిసెంబర్‌లో సైకిల్ యాత్ర ప్రారంభించానన్నారు. తాను వెళ్లిన చోట మొక్కలు నాటుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నానన్నారు. నేపాల్, బంగ్లాదేశ్, వియత్నాం, థాయ్‌లాండ్, బ్యాంకాక్, మాయన్మార్ వంటి దేశాల్లో పర్యటించానని తెలిపారు. అలాగే దేశంలో అన్ని రాష్ట్రాల్లో యాత్ర సాగిస్తున్నానని వివరించారు. ఇప్పటి వరకూ సుమారు 29 వేల కిలోమీటర్లు పర్యటించి సుమారు 7.12 లక్షల మొక్కలు నాటానన్నారు. అనంతరం తంటికొండ రోడ్డులోని జగ్గంపేట బీజేపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, నాయకుడు కంబాల శ్రీనివాసరావుని మర్యాద పూర్వకంగా కలిశారు. పర్యటనలో ముత్తు సెల్వాన్ సైకిల్ పాడవడంతో, నూతన సైకిల్ కొనుగోలు కోసం సహాయం చేయాలని అభ్యర్థించగా రూ.12 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. బుధవారం ఆయన సైకిల్ యాత్ర రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరు గ్రామానికి చేరుకుంది. ఆయన తహసీల్దార్ కార్యాలయానికి చేరుకోగా రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సుహాసిని, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డీఎంఎం శేషగిరి, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్ తదితరులు అభినందించారు.

16న జనసేన సమావేశం

సాక్షి, అమరావతి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం కోసం ఈ నెల 16న ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల జనసేన శ్రేణుల సమావేశం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరుగుతుందని పేర్కొంది. ఆ రోజు రాజమహేంద్రవరం చెరుకూరి కల్యాణ మండపంలో ఈ సమావేశం ఉంటుంది.

కత్తితో దాడి కేసులో నిందితుడి అరెస్ట్

కరప: ఆర్టీసీ డ్రైవర్‌పై కత్తితో దాడి చేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్టు కరప ఎస్ఐ టి.సునీత బుధవారం తెలిపారు. కరప మండలం కూరాడ గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ కేదాసి సూరిబాబుపై అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మేడపాటి శ్రీనివాసరావు ఈ నెల 9న వేళంగి మద్యం షాపు సమీపంలో కత్తితో దాడి చేసి, పరారైన విషయం పాఠకులకు విదితమే. ఈ కేసులో శ్రీనివాసరావును మంగళవారం రాత్రి కరప ఎస్ఐ సునీత అరెస్ట్ చేసి, బుధవారం కాకినాడలోని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కోర్టులో హాజరుపరిచారు. నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించారు.